సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం : 15 : సెప్టెంబర్ : 2023



సీఎం దిష్టిబొమ్మ దహనం

కిషన్‌రెడ్డి దీక్షను భగ్నం చేయడాన్ని నిరసిస్తూ పార్టీ కార్యకర్తలు కేసీఆర్ దిష్టిబొమ్మలు దహనం చేశారు. - IIIలో



కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

హామీలను విస్మరించిన కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కోరారు. - IVలో



ఓటమి భయంతోనే 'జమిలి' కుట్ర

ఓటమి భయంతోనే కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికలంటూ కుట్ర చేస్తుందని ఎమ్మెల్యే గాదరి కిశోర్ అన్నారు. - IVలో

న్యూస్‌రీల్

వస్తువుల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

వలిగొండ : మండలంలోని వెంకటాపురంలో గల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 2023-24 సంవత్సరానికి గాను వివిధ రకాల వస్తువులు సరఫరా చేయడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఈలయ ఈఓ మోహన్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాల్ పోస్టర్, ఫ్లెక్సీలు, ఇన్విటేషన్ కార్డుల ప్రింటింగ్, తడకల పందిళ్లు, మైక్‌సెట్ ఏర్పాటు, ఆర్చీలు వేయడం, టికెట్ పుస్తకాల ముద్రణ, ఎలక్ట్రికల్ డెకరేషన్ మైక్‌సెట్, కూరగాయలు, పాలు, పెరుగు, స్టేషనరీ, శేష వస్త్రాలు, ఫర్నిచర్ సరఫరా, సున్నాలు, రంగులు వేయుటకు సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలవారు 21వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు టెండర్లు దాఖలు చేయాలన్నారు. వివరాలకు దేవస్థానం ఈఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అన్నంపట్ల పంచాయతీకి రాష్ట్ర స్థాయి అవార్డు



మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ వసుమతిజైపాల్‌రెడ్డి

బీబీనగర్ : స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ - 2023 అవార్డుకు బీబీనగర్ మండలంలోని అన్నంపట్ల గ్రామ పంచాయతీ ఎంపికైంది. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ బొక్క వసుమతిజైపాల్‌రెడ్డి పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సునంద, ఎంపీడీఓ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు. దీతో పాటు ఉమ్మడి జిల్లాలో మరో మూడు గ్రామ పంచాయతీలకు రాష్ట్ర స్థాయి అవార్డులు దక్కాయి.

మోతాదుకు మించి యూరియా వాడొద్దు



అడ్డగూడూరు పీఏసీఎస్ గోదాములో యూరియా స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ

అడ్డగూడూరు : మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని గురువారం ఆలేరు ఏడీఏ వెంకటేశ్వర్‌రావు సందర్శించారు. గోదాములో యూరియా స్టాక్‌ను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంటలకు తగిన మోతాదులోనే యూరియా వాడాలని, అవసరానికి మించి కొనుగోలు చేయవద్దన్నారు. 446 బస్తాల యూరియా రాగా 267 మంది రైతులకు యూరియా అందజేసినట్లు చెప్పారు. ఆయన వెంట ఏఓ అరుణ, పీఏసీఎస్ సీఈఓ వెంకటేశ్వర్లు ఉన్నారు.

యాదాద్రిలో విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం చేసి తులసీ దళాలతో అర్చించారు. ఆలయ ముఖ మండపంలో అష్టోత్తరం, శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు గావించారు. వివిధ పూజల ద్వారా నిత్యాదాయం రూ.18,42,162 సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

సాయుధ పోరాట ఫలితమే భూ పంపిణీ



మాట్లాడుతున్న గోద శ్రీరాములు

ఆత్మకూరు(ఎం) : తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగానే దేశ వ్యాప్తంగా పది లక్షల ఎకరాల భూ పంపిణీ జరిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆత్మకూర్(ఎం) మండలంలోని కప్రాయపల్లిలో దూదిపాల సత్తిరెడ్డి స్మారక స్థూపానికి నివాళులర్పించి మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పేదల పక్షాల కమ్యూనిష్టు పార్టీ పోరాడిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జల్లి రాములు, నాయకులు పాశికంటి లక్ష్మీనర్సయ్య, ఉప్పల ముత్యాలు, నాయకులు సోలిపురం లింగారెడ్డి, బొబ్బల లాల్‌రెడ్డి, జక్కు దయాకర్‌రెడ్డి, మారుపాక వెంకటేశం, కల్వల నర్సయ్య పాల్గొన్నారు



భూదాన్ పోచంపల్లి మండలంలోని జూలూరు గ్రామశివారులో పచ్చదనంతో కనువిందు చేస్తున్న వరి పైరు

టెట్‌కు అంతా సిద్ధం

- నేడు ఉదయం పేపర్ -1, మధ్యాహ్నం పేపర్ -2
- పరీక్షల నిర్వహణకు 13 కేంద్రాలు
- హాజరుకానున్న అభ్యర్థులు 5,798 మంది
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



భువనగిరిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

భువనగిరి : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పేపర్ - 1 పరీక్ష, మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5గంటల వరకు పేపర్- 2 పరీక్ష జరగనుంది. పేపర్-1కు 2,976 మంది, పేపర్ -2కు 2,822 మంది హాజరు కానున్నారు. జిల్లా వ్యాప్తంగా 13 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష పర్యవేక్షణకు 13 మంది చీఫ్ సూపరింటెండెంట్లు ,13 మంది డిపార్టమెంటల్ అధికారులు, 150 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

పరీక్ష కేంద్రాలు

టెట్ పరీక్ష కోసం కేంద్రాలన్నీ భువనగిలోనే ఏర్పాటు చేశారు. గౌతమ్ మోడల్ స్కూల్ (విద్యానగర్), న్యూ డైమెన్షన్ స్కూల్ (సువాలీ ఎస్టేట్ నల్లగొండ రోడ్డు), దివ్యబాల విద్యాలయం (దివ్య బాలనగర్), నల్లగొండ రోడ్డు (అనాజిపురం), మాంటిస్సోరి హైస్కూల్ (రాంనగర్), సెయింట్ ఎలిజబెత్ హైస్కూల్ (టీచర్స్ కాలనీ), వెన్నెల ఇనిస్టిట్యూట్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయం), భువనగిరి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ (శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయం), నవ భారత్ డిగ్రీ కళాశాల (పహాడీనగర్), మథర్ థెరిస్సా హైస్కూల్ (ఆజాద్ రోడ్డు), జాగృతి డిగ్రీ మరియు పీజీ కళాశాల (ఆజాద్ రోడ్డు), ప్రెసిడెన్సీ హైస్కూల్ (తాతానగర్), ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సెంటర్లు ఏర్పాటు చేశారు.

144 సెక్షన్ అమలు

పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్ష జరగనుంది. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. ఇదిలా ఉండగా పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసిన విద్యాసంస్థలకు విద్యాశాఖ సెలవు ప్రకటించింది.

వీటిని అనుమతించరు

- నిమిషం అలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతించబడరు.
- గడియారం, సెల్ ఫోన్లు, క్యాలిక్‌లేటర్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు.
- అభ్యర్థులు ఓఎంఆర్ షీట్‌లోని గదులను బబుల్ చేయడానికి బ్లాక్ బాల్ పాయింట్ పెన్ను మాత్రమే ఉపయోగించాలి.

అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి



టెట్‌కు పటిష్ట ఏర్పాట్లు చేశాం. అభ్యర్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. హాల్ టిక్కెట్ తప్పనిసరిగా తెచ్చుకోవాలి. ఎవరైనా మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

–వినయ్ కృష్ణారెడ్డి, కలెక్టర్

ఆరేళ్లలో.. 72 మంది బలి

- యమపాశాలుగా మారుతున్న లూజ్ లైన్లు
- కంచెలు లేని ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదాలు
- విద్యుదాఘాతంతో గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- మృతుల్లో అధికంగా రైతులే
- బాధిత కుటుంబాలకు అందని పరిహారం



వలిగొండ మండలం నాగారంలో బుధవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన బండ అంజయ్య, జంగమ్మ దంపతులు

సంవత్సరం	మృతులు	పరిహారం అందిన కుటుంబాలు
2018 -19	17	16
2019 -20	18	14
2020-21	12	12
2021-22	10	08
2022-23	13	06
2023-24	02	-
మొత్తం	72	56

వలిగొండ మండలం నాగారం గ్రామానికి చెందిన బండ అంజయ్య, జంగమ్మ దంపతులు ఈనెల 13న తమ పొలంలో వరాలకు ఉన్న గడ్డిని యంత్రంతో కోయిస్తున్నారు. ఈ క్రమంలో పక్కనే స్తంభంపై ఉన్న కరెంట్ వైరు తెగి పడింది. అది గమనించని అంజయ్య వైరును తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడిని కాపాడే ప్రయత్నంలో భార్య కూడా విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది.

చౌటుప్పల్ మండలం మందోల్లగూడేనికి చెందిన రైతు యాట ముత్యాలు లింగారెడ్డిగూడెంలో భూమికి కౌలుకు తీసుకొని వరి సాగు చేశాడు. బోరు చుట్టూ గడ్డి పెరగడంతో కొడవలితో తొలగిస్తుండగా మోటార్‌కు ఏర్పాటు చేసిన కరెంట్ వైరు తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృత్యువాతపడ్డాడు. ఈ ఏడాది జూలై 21న సంఘటన జరగగా నేటికీ పరిహారం అందలేదు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

భూదాన్‌పోచంపల్లి మండలం కనుముకుల గ్రామానికి చెందిన గజ్జి జంగయ్య గత ఏడాది నవంబర్ 4న వ్యవసాయ బావి వద్ద మోటార్ పెట్టడానికి వెళ్లాడు. ఫ్యూజ్ పోవడంతో లైన్‌మన్ వచ్చేసరికి ఆలస్యం అవుతుందని భావించి తానే ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. జిల్లాలో ఇటువంటి ఘటనలు నిత్యకృతం అయ్యాయి.

సాక్షి, యాదాద్రి : విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు మనుషులను కాటేస్తున్నాయి. పొలాల వద్ద మోటార్లు, తీగలు, ఫ్యూజ్‌లను సరి చేస్తున్న క్రమంలో ప్రాణాలు కోల్పోయిన వారు కొందరైతే.. లూజ్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ చర్యలు లేకపోవడం వల్ల విద్యుదాఘాతానికి గురై మరణించిన వారు మరి కొందరున్నారు. జిల్లాలో గడిచిన ఆరేళ్లలో 72 మంది కరెంట్ కాటుకు బలవగా అందులో అధిక శాతం రైతులే ఉన్నారు. సమస్య తలెత్తినప్పుడు విద్యుత్ సిబ్బంది సకాలంలో స్పందించకపోవడంతో రైతులే స్వయంగా మరమ్మతులకు దిగుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. పెద్ద దిక్కును కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న కుటుంబాలకు సకాలంలో ఎక్స్‌గ్రేషియా అందజేయడంలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్న విమర్శలున్నాయి. సహాయం అందించడానికి కొర్రీలు పెడుతున్నారని బాధితులు వాపోతున్నారు.

కొన్ని ఘటనలు ఇలా..

- యాదగిరిగుట్ట మండలం వంగపల్లికి చెందిన దండ్ల సురేష్ కరెంట్ షాక్‌తో మృతి చెందాడు.
- మూసాయిపేటకు చెందిన మేకల భిక్షపతి
- భువనగిరి మండలం బస్వాపూర్‌లో మత్రి శంకర్
- యాదగిరిగుట్టలో రాజస్థాన్‌కు చెందిన మహేంద్రకుమార్
- నాంపల్లి మండలం ఎస్.లింగోటం గ్రామానికి చెందిన వల్లపు ప్రశాంత్, తల్లోజు అరుణ్‌చారి సంస్థాన్‌నారాయణపురం మండలం మత్రిబావి తండాలో చనిపోయారు
- ఆలేరు మండలం గొలనుకొండ గ్రామంలో మొండిగుజ్జుల సోమయ్య
- బొమ్మలరామారం మండలం మేడిపల్లిలో ఒడిశా కూలీ సంతోష్ కుంబార్
- రంగాపూర్‌లో బెజ్జంకి మల్లారెడ్డి
- లక్ష్మీతండాలో ఒడిశా కూలీ టాను సాబర్
- మైలారం గ్రామంలో ఇండ్ల సత్యనారాయణ
- మాల్యాల గ్రామ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్లకు చెందిన దాసరి కృపారావు
- మోటకొండూరు మండలం కాటేపల్లిలో గంధమల్ల రాణి, శివరాత్రి గౌరమ్మ
- చాడ గ్రామంలో భూదేవి శ్రీనివాస్
- రాజాపేట మండలం పాముకుంటలో జహంగీర్
- సోమారం గ్రామంలో జంగ శారద
- రేణిగుంటలో విద్యుత్ లైన్‌మన్ రామ్‌సింగ్
- రాజాపేటలోని ఓ పౌల్ట్రీ ఫాంలో సిద్దిపేట జిల్లా దవలాపూర్‌కు చెందిన ముక్కెర యాదగిరి
- లక్ష్మక్కపల్లిలో రైతు బూడిద రవి
- ఆత్మకూరు (ఎం) మండలం మొరిపిరాలకు గ్రామంలో నల్ల కృష్ణస్వామి
- గుండాల మండలం వస్తాకొండూరుకు చెందిన సుంకరి మహేష్
- పెద్ద పడిశాలలో రావుల మల్లేష్
- సీతారాంపురంలో ఇందిరాల పద్మ
- సుద్దాల గ్రామంలో మబ్బు రాములు
- బండకొత్తపల్లిలో కొమరయ్య విద్యుదాఘాతంతో మృతి చెందాడు.

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

- డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు

భువనగిరి : ఆయుష్మాన్ భవ పథకం ద్వారా మెరుగైన వైద్యసేవలందించి ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించుకుందామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లికార్జున్ రావు సూచించారు. భువనగిరిలోని ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ ఫంక్షన్‌హాల్‌లో ఆయుష్మాన్ భవ కార్యక్రమంపై ఆశ కార్యకర్తలకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంత్యోదయ కార్డులు ఉన్న వారికి ఈ నెల 17వ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఆయుష్మాన్ భవ పథకం కింద వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. ప్రతి శనివారం గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి ఆయుష్మాన్ భవ ప్రాధాన్యత, అందించనున్న వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. 30 సంవత్సరాలపై బడిన వారికి తప్పనిసరిగా స్క్రీనింగ్ నిర్వహించాలని కోరారు. బీపీ, డయాబెటిక్ వ్యాధులు ఉన్న వారిని గుర్తించి మందులు అందజేయాలన్నారు. నెలలో ఒక్కసారి ఆరోగ్య మేళా ఏర్పాటు చేయాలని డాక్టర్లకు సూచించారు. ఉత్తమ సేవలందించి ప్రధానమంత్రి ఉత్తమ ఆరోగ్య గ్రామాల అవార్డులు పొందడానికి కృషి చేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. ప్రజలు ఆయుష్మాన్ భవ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యశోద, ప్రోగ్రాం అధికారులు పాపారావు, సుమన్ కళ్యాణ్, వినోద్, డిప్యూటీ డెమో మధుసూదన్‌రెడ్డి, హెచ్‌ఈ సత్యనారాయణ, ఎస్తేరా రాణి, ఎలిజిబెత్, సత్యవతి, విజయరాణి పాల్గొన్నారు.

మట్టి వినాయకులనే పూజించాలి



కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

సాక్షి,యాదాద్రి : గణష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలను అవగాహనపరిచే కార్యక్రమంలో భాగంగా కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన పోస్టర్‌ను గురువారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రంగులు, రసాయనాలతో తయారు చేసిన వినాయక విగ్రహాల వల్ల జల వనరులు కాలుష్యానికి గురవుతున్నాయన్నారు. అందుకే మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయాలని సూచించారు. 16వ తేదీన కలెక్టరేట్‌లో 2 వేల మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వినాయక చవితి ఉత్సవాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర కాలుష్యం నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఎకో ఫ్రెండ్లీ క్విజ్ కాంపిటీషన్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఆసక్తి కలిగిన వారు వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, ఉమ్మడి నల్గొండ జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ సాజీనా, జిల్లా వెనుకబడిన తరగతులు, పరిశ్రమల శాఖ అధికారులు యాదయ్య, శ్రీలక్ష్మి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, కలెక్టరేట్ ఏఓ జగన్ తదితరులు పాల్గొన్నారు.

యోగానంద నిలయం కూల్చివేత

- 'సాక్షి' కథనానికి స్పందన
- నూతన భవన నిర్మాణానికి సన్నాహాలు

సాక్షి ఎఫెక్ట్..

యాదగిరిగుట్ట : పట్టణంలోని బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న యోగానంద నిలయం కూల్చివేత పనులను గురువారం ప్రారంభించారు. యోగానంద నిలయం నాలుగేళ్లుగా నిరుపయోగంగా ఉండడం, ఆలయానికి భక్తుల తాకిడి పెరుగుతున్నా తెరవకపోవడంతో 'శ్రద్ధపెడితే సద్వినియోగం' అనే శీర్షికతో ఈనెల 12న సాక్షి ప్రచురించిన కథనానికి యాదాద్రి ఆలయ అధికారులు స్పందించారు. భవన సముదాయాన్ని పూర్తిగా తొలగించి అదే స్థలంలో రెండు, మూడు పడకల గదులతో పాటు డార్మిటరీ హాళ్లు, మినీ బాంక్వెట్ హాళ్లు నిర్మించనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.



యోగానంద నిలయాన్ని తొలగిస్తున్న దృశ్యం

క్రీడా సంగ్రామానికి సై

- మూడేళ్ల తర్వాత ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆటల పోటీలు
- 16 నుంచి మండల స్థాయిలో..
- 25 నుంచి 30వ తేదీ వరకు జిల్లా స్థాయిలో నిర్వహణ



భువనగిరి: మూడేళ్ల నిరీక్షణ తరువాత పాఠశాల విద్యార్థుల క్రీడాపోటీలకు మోక్షం కలిగింది. భారత పాఠశాలల క్రీడల సమాఖ్య (ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో 67వ మండల, జోనల్, జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 16 నుంచి ప్రారంభంకానున్నాయి.యేటా ఎస్‌జీఎఫ్‌ఐ పాఠశాలల విద్యార్థులకు వివిధ విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తుంది. ఇందులో క్రీడాకారులు మండలం నుంచి జాతీయ స్థాయి వరకు తమ ప్రతిభను కనబరిచే అవకాశం ఉంటుంది. అయితే కరోనాతో 2020 విద్యా సంవత్సరం నుంచి మూడేళ్ల పాటు ఈ పోటీలు నిర్వహించలేదు. అసోసియేషన్ల ఆధ్వర్యంలో మాత్రమే క్రీడా పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీలకు క్రీడాకారులే తమ సొంత డబ్బులతో వెళ్లాల్సి ఉంటుంది. ఎస్‌జీఎఫ్‌ఐ నిర్వహించే పోటీలకు ప్రభుత్వమే ఖర్చు భరిస్తుంది. ఈ విద్యా సంవత్సరంలో క్రీడలకు ప్రభుత్వం పచ్చజెండా చూపడంతో జిల్లాలో వీటికి సంబంధించిన కార్యాచరణ రూపొందించారు. దీంతో మండల స్థాయిలో ఈనెల 16 నుంచి క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. కాగా.. జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించకుండా నేరుగా జిల్లా స్థాయి పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు.

నైపుణ్యం పెంపొందించేందుకు..

జిల్లాలో 712 పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో మొత్తం 57,249 మంది విద్యార్థులు ఉన్నారు. ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎస్‌జీఎఫ్‌ఐ ద్వారా నిర్వహించే క్రీడా పోటీల్లో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకునేందుకు దోహదపడనున్నాయి. ఇప్పటికే జిల్లాలో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించారు. పాఠశాల స్థాయిలోనే ఈ క్రీడాపోటీలతో విద్యార్థులు తమ క్రీడానైపుణ్యాలను మరింతగా మెరుగుపర్చుకునేందుకు ఉపయోగపడనున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి

ఈ నెల 16 నుంచి మండల స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడా పోటీలు జరుగుతాయి. ఇందుకోసం ఇప్పటికే ఆయా మండలాలకు సంబంధించి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలకు సూచనలు చేశాం. ఏర్పాట్లు కూడా పూర్తి చేశాం. ఉన్నత అధికారుల సూచనల ప్రకారం జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 25 నుంచి జరగనున్నాయి. ఈ పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– స్టాలిన్‌బాబు, ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి

నిబంధనలు..

- అండర్ -14 విభాగంలో బాలబాలికలకు నిర్వహించనున్న క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 2010 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించి ఉండాలి.
- 17 సంవత్సరాల లోపు బాలబాలికల సీనియర్ విభాగంలో 2007 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారై ఉండాలి.
- అథ్లెటిక్స్ బాలబాలికల విభాగంలో ఒక్కో అంశానికి మండలం నుంచి జిల్లాకు ప్రాతినిధ్యం వహించడానికి ఇద్దరు క్రీడాకారులు మాత్రమే అర్హత కలిగి ఉంటారు.
- ఆయా విభాగాల్లో విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడాపోటీలు మాత్రమే నిర్వహించనున్నారు.
- మండల స్థాయి పోటీలు ఈ నెల 16 నుంచి నిర్వహించనుండగా, జిల్లా స్థాయి పోటీలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 25 నుంచి 30వ తేదీల్లో జరగనున్నాయి.

బైక్ ర్యాలీని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న పీవీ శ్యాంసుందర్‌రావు

భువనగిరి : 'చలో పరకాల' బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్ రావు పిలుపునిచ్చారు. గురువారం భువనగిరిలోని అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాట్లు పరిశీలించి మాట్లాడారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఉస్మానియ యూనివర్సిటీ క్యాంపస్ నుంచి చేపట్టనున్న బైకు ర్యాలీకి జిల్లాలో కొండమడుగు, భువనగిరిలో స్వాగతం పలుకుతామన్నారు. అనంతరం ఆయన అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తారని, అక్కడి నుంచి పరకాలకు వెళ్తారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల నర్సింగ్‌రావు, చిక్క కృష్ణ, శ్రీనివాస్, చందా మహేందర్ గుప్తా, మాయ దశరథ, జనగాం నర్సింహాచారి, రాజశేఖర్‌రెడ్డి, నరేష్‌నాయక్, కపిల్, రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పర్సాయపల్లి గ్రామవాసికి ఉపాధ్యాయరత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు వెంకన్న

అర్వపల్లి: మండల పరిధిలోని పర్సాయపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు కేసారపు వెంకన్న ఉపాధ్యాయరత్న అవార్డుకు ఎంపిక య్యారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం–భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గురువారం హైదరాబాద్‌లో జగతి ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, కవి, రచయిత జయరాజు చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. వెంకన్న హైదరాబాద్‌లోని నాగార్జున హైస్కూల్‌లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా వెంకన్నను గ్రామస్తులు అభినందించారు.

వరకట్న వేధింపు కేసులో మూడేళ్లు జైలు శిక్ష

చివ్వెంల(సూర్యాపేట): వరకట్న వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకోగా.. ఈ కేసులో ఆమె భర్తకు మూడేళ్లు జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ గురువారం తీర్పు వెల్లడించారు. వివరాలు.. నడిగూడెం మండల వేణుగోపాలపురం గ్రామానికి చెందిన జ్యోతుల నాగార్జునకు, హుజూర్‌నగర్‌కు చెందిన మౌనికతో వివాహం జరిగింది. కాగా అదనపు కట్నం తీసుకురావాలని అత్త, మామ, భర్త వేధిస్తుండటంతో 2017లో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని మౌనిక ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఆమె భర్త, అత్తమామలపై పోలీసులు కేసు నమోదు చేశారు. మౌనిక భర్తను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు గురువారం తుది విచారణకు రాగా.. పలువురు సాక్షులను విచారించిన సూర్యాపేట జిల్లా న్యాయమూర్తి జి. రాజగోపాల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాకి రాంరెడ్డి వాదనలతో ఏకీభవిస్తూ నిందితుడికి మూడేళ్లు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు లైజన్ ఆఫీసర్ కె. సురేంద్రబాబు, కోర్టు కానిస్టేబుల్ పాపారావు సహకరించారు.

ఉద్యాన పంటలతో అధిక ఆదాయం



ఉద్యాన పంటలపై అవగాహన కల్పిస్తున్న కేవీకే సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్

గరిడేపల్లి: రైతులు ఉద్యాన పంటలు పండించి అధిక ఆదాయం పొందవచ్చని గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త బి. లవకుమార్ అన్నారు. దాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాద్రాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం నుంచి వచ్చిన రైతులు గురువారం గడ్డిపల్లిలోని కేవీకేను సందర్శించారు. ఈ సందర్భంగా వారికి సమగ్ర, సేంద్రియ వ్యవసాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు కిరణ్, ఆదర్శ్, సంస్థాన్ నారాయణపురం రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యదర్శి మేఘారెడ్డి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ యాదయ్య, భగవంతు కృష్ణారెడకడి, దాన్ ఫౌండేషన్ అసోసియేట్ లావణ్య, మంజుల, జయశ్రీ, అర్చన తదితరులు పాల్గొన్నారు.

తండా నుంచి జాతీయ స్థాయికి..

- వీల్‌చైర్ క్రికెట్‌లో రాణిస్తున్న రంగుండ్ల తండాకు చెందిన వికలాంగ యువకుడు
- అక్టోబర్ 6 నుంచి 11 వరకు నేపాల్‌లో జరిగే ఆసియా కప్‌లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం
- దాతల సాయం కోసం ఎదురుచూపు



వీల్‌చైర్‌లో కూర్చొని క్రికెట్ సాధన చేస్తున్న సురేష్



టీం సభ్యులతో కలిసి ట్రోఫీ అందుకుంటున్న సురేష్ (ఫైల్)

తిరుమలగిరి(నాగార్జునసాగర్): పుట్టిన కొద్ది నెలలకే పోలియో వ్యాధి సోకి వికలాంగుడిగా మారిన ఓ యువకుడు పట్టుదలతో సాధన చేసి వీల్‌చైర్ క్రికెట్‌లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదిగాడు. వివరాలు.. తిరుమలగిరి(సాగర్) మండలంలోని రంగుండ్ల తండాకు చెందిన ధరావత్ బాలు, మల్లి దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. వారిది నిరుపేద కుటుంబం కావడంతో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. చిన్న కుమారుడు ధరావత్ సురేష్ పుట్టిన ఎనిమిది నెలలకే పోలియో వ్యాధి సోకడంతో వికలాంగుడయ్యాడు. డిగ్రీ పూర్తిచేసిన సురేష్‌కి క్రికెట్ అంటే ఎంతో ఇష్టం. వికలాంగుడైనప్పటికీ పట్టు వదలకుండా ఊత కర్ర సాయంతో గ్రామంలో స్నేహితులతో క్రికెట్ ఆడుతుండేవాడు. ప్రతిరోజు క్రికెట్ సాధన చేస్తూ ఆటలో పట్టు సాధించాడు.

ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ..

సురేష్ 2020లో రాజస్థాన్‌లో నిర్వహించిన నేషనల్ వీల్‌చైర్ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. అక్కడ మంచి ప్రతిభ కనబర్చి బెస్ట్ ఫీల్డర్ అవార్డు అందుకున్నాడు. 2021లో ముంబైలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చాడు. 2022లో ఢిల్లీలో నిర్వహించిన ఐడబ్ల్యూసీపీఎల్(ఇండియన్ వీల్‌చైర్ క్రికెట్ ప్రీమియం లీగ్)కు ఎంపికై ఉత్తమ ఫీల్డర్‌గా, బ్యాట్స్‌మెన్‌గా రాణించాడు. అతడి ప్రతిభను గుర్తించిన సెలక్టర్లు దేశం తరఫున వీల్‌చైర్ క్రికెట్ జట్టుకు ఎంపిక చేశారు. దివ్యాంగ క్రికెట్ కంట్రోల్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నేపాల్ దేశ రాజధాని ఖాట్మాండులో అక్టోబర్ 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే దివ్యాంగుల వీల్‌చైర్ ఆసియా కప్ క్రికెట్ టోర్నమెంట్‌కు దేశం తరఫున ఎంపికయ్యాడు.

ఆర్థికంగా ఇబ్బందులతో..

ఆసియా కప్‌లో పాల్గొనేందుకు అక్టోబర్ 1వ తేదీన నేపాల్‌కు వెళ్లాల్సి ఉంది. ఆ టోర్నమెంట్‌లో ఆడాలంటే ముందుగానే దివ్యాంగ క్రికెట్ కంట్రోల్ బోర్డు ఆఫ్ ఇండియాకు రూ.25,000 చెల్లించాల్సి ఉంటుంది. నేపాల్ వెళ్లేందుకు రవాణా ఖర్చులు కూడా ఆటగాళ్లే భరించాల్సి ఉండటంతో దాతల సాయం కోసం సురేష్ ఎదురుచూస్తున్నాడు.

సాయం చేయాల్సిన వివరాలు

బ్యాంక్ అకౌంట్ నంబర్: 104510100129719
(యూనియన్ బ్యాంక్, తిరుమలగిరి బ్రాంచ్)
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఏఎన్‌డీబీ0001045
గూగుల్ పే, ఫోన్ పే నంబర్: 9603311510

గర్వంగా ఉంది



వీల్‌చైర్ క్రికెట్ పోటీల్లో దేశం తరఫున ఆడటం గర్వంగా ఉంది. గత ఐదు సంవత్సరాలుగా పడుతున్న కష్టానికి ఫలితం దక్కింది. ఆసియా కప్‌లో పాల్గొనాలంటే బోర్డుకు కొంత డబ్బు చెల్లించాల్సి ఉంది. దాతలు పెద్ద మనుస్సుతో సాయం చేయాలి. – ధరావత్ సురేష్

మంచి పేరు తీసుకొస్తాడు



నా కుమారుడు వికలాంగుడైనప్పటికీ ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. పట్టుదలతో దేశం తరఫున క్రికెట్ ఆడే స్థాయికి రావడం సంతోషంగా ఉంది. దాతలు సాయం ఆర్థికసాయం చేస్తే భారతదేశానికి మంచి పేరు తీసుకొస్తాడనే నమ్మకం ఉంది.
– ధరావత్ బాలు, సురేష్ తండ్రి

మిల్లులో నెట్ కూలి ఐదుగురికి తీవ్రగాయాలు

మునగాల(కోదాడ): మండల కేంద్రంలోని ఓ రైస్ మిల్లులో గురువారం ధాన్యం బస్తాల నెట్ కూలి ఐదుగురు కూలీలకు గాయాలయ్యాయి. హమాలీ యూనియన్ నాయకుడు తెలిపిన వివరాల ప్రకారం .. మునగాల మండల కేంద్రంలోని నాగార్జున మోడ్రన్ రైస్ మిల్లులో హమాలీలు ధాన్యం బస్తాలను బడ్డీలో పోస్తుండగా ప్రమాదవశాత్తు నెట్ కూలిపోయి వారిపై పడింది. ఈ ప్రమాదంలో మునగాల మండలంలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన రావులపెంట సైదులు, పిల్లుట్ల సైదులు, తాడువాయి తండాకు చెందిన మాలోతు గన్యా, నునావత్ సుందరయ్య, మునగాల మండల కేంద్రానికి చెందిన లంజేపల్లి ఏసుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను సహచర హమాలీలు చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. రావులపెంట సైదులు, లంజేపల్లి ఏసు, మాలోతు గన్యాను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు, పిల్లుట్ల సైదులు, నునావత్ సుందరయ్యను ఖమ్మంకు తరలించారు. కాగా ఈ ప్రమాదానికి సంబంధించి స్థానిక ఎస్ఐ పి. లోకేష్‌ను వివరణ కోరగా.. తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. క్షతగాత్రులలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

అదుపుతప్పి లారీ బోల్తా



బోల్తా పడిన ధాన్యం లారీ

తిరుమలగిరి (తుంగతుర్తి): మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీ సమీపంలో గురువారం తెల్లవారుజామున నకిరేకల్ వైపు ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి డివైడర్ పైకి ఎక్కి బోల్తా పడింది. దీంతో ధాన్యం బస్తాలు రోడ్డుపై పడిపోయాయి. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా, వేగంగా లారీ నడపడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ



కొర్లపహాడ్ టోల్‌గేట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్టీసీ, పోలీసు అధికారులు

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద గురువారం జిల్లా పోలీసులు, ఆర్టీసీ అధికారులు సంయుక్తంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో వెళ్తున్న ప్రతి ప్రైవేట్ వాహనాన్ని అధికారులు తనిఖీ చేశారు. వ్యక్తిగత వాహనం పేరుతో రిజిస్ట్రేషన్ నమోదు చేయించి అక్రమంగా ప్రయాణికులను తీసుకెళ్తున్న వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేశారు. జరిమానాలు విధించారు. ఆయా వాహనాలలోని ప్రయాణికులను కిందకు దింపి ఆర్టీసీ బస్సులలో ఎక్కించి వారి గమ్యస్థానాలకు పంపించారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరికి గాయాలు

రామగిరి(నల్లగొండ): బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం తిప్పర్తి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు.. యాదాద్రి భువనగిరి జిల్లాలోని పోచర్లబోడ్ తండాకు చెందిన ధారావత్ రాకేష్(21) మిర్యాలగూడ నుంచి నల్లగొండ వైపునకు బైక్‌పై వెళ్తుండగా.. అదే సమయంలో నల్లగొండ నుంచి మిర్యాలగూడకు వెళ్తున్న కారు తిప్పర్తి పోలీస్ స్టేషన్ సమీపంలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాకేష్ ఎడవ కాలు విరిగింది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నల్లగొండ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

వాటర్ హీటర్‌ను పట్టుకొని బాలుడి మృతి



బిట్టు (ఫైల్)

కోదాడ రూరల్ : అభం శుభం తెలియని ఏడాది వయస్సున్న బాలుడు వాటర్‌హీటర్‌ను పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ సంఘటన కోదాడ మండల పరిధిలోని రామలక్ష్మీపురంలో గురువారం చోటుచేసుకుంది. పాముల వెంకటనారాయణ, శిరీషా దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం ఉదయం శిరీషా పెద్ద కుమారుడిని పాఠశాలకు పంపించడానికి వెళ్లగా, వెంకటనారాయణ కూలీ పనికి వెళ్లాడు. ఏడాది వయస్సున్న చిన్న కుమారుడు బిట్టు ఇంట్లో ఆడుకుంటూ వెళ్లి.. వేడి నీటి కోసం పెట్టి ప్లగ్‌తీయని వాటర్ హీటర్‌ను పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కొద్దిసేపటి తర్వాత బాలుడి నాయనమ్మ గమనించగా అప్పటికే బాలుడు కిందపడి మృతిచెంది ఉన్నాడు.

గిరిజన బాలికల హాస్టల్‌లో విద్యార్థినులకు అస్వస్థత

మిర్యాలగూడ: పట్టణంలోని ఖమ్మం రోడ్డులో గల గిరిజన బాలికల హాస్టల్‌లో గురువారం ఏడుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. 9, 10 తరగతులు చదివే వడిత్య అనూష, చిట్టి, సంధ్యతో పాటు మరో నలుగురు విద్యార్థినులు కడుపునొప్పితో అస్వస్థతకు గురయ్యారు. వారికి మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. అనూష ప్రస్తుతం ఆస్పత్రిలోనే చికిత్స పొందుతుంది. ఈ ఘటన గురువారం ఉదయం జరిగినప్పటికీ విషయం బయటకు రాకుండా హాస్టల్ వార్డెన్ గోప్యంగా ఉంచారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

రేషన్ బియ్యం కొనుగోలుపై అన్నదమ్ముల మధ్య వాగ్వాదం

చిలుకూరు: లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసే విషయమై గురువారం చిలుకూరు గ్రామంలో ఇద్దరు అన్నదమ్ములు బహిరంగంగా వాగ్వాదానికి దిగారు. చిలుకూరు గ్రామంలోని శివాలయం వద్ద ఇద్దరు అన్నదమ్ములు రేషన్ బియ్యంను అక్రమంగా కొనుగోలు చేస్తుండడమే కాకుండా, బియ్యం కొనుగోలు విషయంలో ఘర్షణకు దిగారు. దీనిపై చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. కొంత కాలంగా వారిద్దరు రేషన్ బియ్యం ఇచ్చే సమయంలో ఏకంగా ఆ రేషన్ షాపు ఉండే బజారులోనే తిష్ట వేసి లబ్ధిదారుల నుంచి బహిరంగంగా బియ్యం కొనుగోలు చేస్తున్నారని పలువురు గ్రామస్తులు అంటున్నారు.

క్రైస్తవులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



అభివాదం చేస్తున్న క్రైస్తవ ప్రతినిధులు

రామగిరి(నల్లగొండ): వచ్చే అసెంబ్లీ రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని పార్టీలు క్రైస్తవులకు తగిన ప్రాధాన్యం కల్పించాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు డిమాండ్ చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా క్రైస్తవుల చైర్మన్ రేకల భద్రాద్రి అధ్యక్షతన నల్లగొండ పట్టణంలోని గురువారం నిర్వహించిన క్రైస్తవ సంఘాల ప్రతినిధుల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పూజారులు, ఇమామ్‌లకు ఇచ్చే విధంగా క్రైస్తవ సేవకులకు కూడా ప్రభుత్వం గౌరవ వేతనం ఇచ్చి చేయూతనివ్వాలన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే విధంగా శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలన్నారు. క్రైస్తవ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా గురుకులం ఏర్పాటు చేయాలన్నారు. జీఓ నంబర్ 58, 59 ద్వారా ప్రభుత్వం భూముల్లో నిర్మించుకున్న క్రైస్తవుల ఇళ్లు, చర్చిలు, షెడ్లను రెగ్యులరైజ్ చేసి పట్టాలు ఇవ్వాలన్నారు. తెలంగాణ వ్యాప్తంగా అన్ని పార్టీలు క్రైస్తవులకు మూడు ఎమ్మెల్యే, ఒక పార్లమెంట్, రాజ్యసభ స్థానాలు, రెండు ఎమ్మెల్సీలను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో మోజెస్, రాజు, వేణు, ప్రవీణ్ కుమార్, దినేష్, అనిల్, మణి, ఎలీషా, ఆశయ, ఆనందయ్య తదితరులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మోత్కూరు: ఆర్థిక ఇబ్బందులతో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో గురువారం వెలుగులోకి వచ్చింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన నిలిగొండ లక్ష్మయ్య(38)కు భార్య కనకమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. లక్ష్మయ్య స్థానిక పెద్ద చెరువు కట్ట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద పంక్చర్ దుకాణం నిర్వహిస్తుండడంతో పాటు వ్యవసాయ పంటలకు పురుగు మందు పిచికారీ చేసేందుకు కూలికి సైతం వెళ్లేవాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న లక్ష్మయ్య మనస్తాపంతో బుధవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో బిక్కేరు వాగు సమీపంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా.. వారు వచ్చి అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

గుడివాడ గ్రామంలో విషాదఛాయలు



మృతుల కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కేతేపల్లి: నకిరేకల్ మండలంలోని తాటికల్ గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కేతేపల్లి మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన నవ దంపతులు చిత్తలూరి మహేష్, రిషిత మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. నెల రోజుల క్రితమే ప్రేమించి పెళ్లి చేసుకున్న యువ జంట రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో వారి కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం గురువారం సాయంత్రం గుడివాడకు తీసుకొచ్చారు. మృతులను చూసేందుకు భారీగా బంధువులు, గ్రామస్తులు తరలివచ్చారు. అంతకుముందు నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాలను స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, టీపీసీసీ మాజీ కార్యదర్శి దైద రవీందర్‌లు వేర్వేరుగా సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి వెంట నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, గుడివాడ సర్పంచి కట్ట శ్రవణ్, మాజీ సర్పంచ్ ఎస్‌కే లతీఫ్ తదితరులు ఉన్నారు.

ఆస్తి పంపకాల తర్వాతే దహన సంస్కారాలు

- తమ పేరిట భూమి పట్టా చేసేదాకా సోదరుడి అంత్యక్రియలను అడ్డుకున్న అన్నదమ్ములు

మోతె: ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాల కంటే ఆస్తులే ముఖ్యంగా మారాయి. ఇలాంటి ఘటనే మోతె మండల పరిధిలో సిరికొండ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... సిరికొండ గ్రామానికి చెందిన వెంపటి సత్యనారాయణ(63), భాగ్యమ్మ భార్యాభర్తలు. వీరికి సంతానం లేదు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండడంతో సత్యనారాయణ తన సోదరుల వద్ద ఉంటున్నాడు. భాగ్యమ్మ కూడా ఆమె సోదరుల వద్దే ఉంటుంది. ఇటీవల సత్యనారాయణ క్యాన్సర్ బారిన పడడంతో వైద్యం కోసం అతడి సోదరులు లక్షల రూపాయలు అప్పు చేసినట్లు చెబుతున్నారు. భాగ్యమ్మకు సిరికొండలో తన తల్లిగారు ఇచ్చిన నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఆమె పేరునే ఉంది. భాగ్యమ్మ పేరిట ఉన్న నాలుగెకరాల భూమిలో ఎకరం సత్యనారాయణ పేరున రిజిస్ట్రేషన్ చేసేందుకు ఇటీవల గ్రామ పెద్దలు నిర్ణయించి సోమవారం ధరణిలో స్లాట్ బుక్ చేశారు. మంగళవారం రిజిస్ట్రేషన్ కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాల్సి ఉండగా.. అదే రోజు సత్యనారాయణ మృతిచెందాడు. అయితే సత్యనారాయణ వైద్యం కోసం రూ.30లక్షలు ఖర్చు చేశామని, ఎకరన్నర భూమి తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని అతడి సోదరులు పట్టుబట్టారు. భూమి రిజిస్ట్రేషన్ చేసే దాకా దహన సంస్కారాలు చేయకుండా అడ్డుకున్నారు. ఇదే అదనుగా భావించి భాగ్యమ్మ సోదరులు, వారి కుటుంబ సభ్యులు తమ పేరిట కూడా భూమి పట్టా చేయాలని పట్టుబట్టారు. బుధవారం సత్యనారాయణ సోదరులు ఎకరన్నర భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. భాగ్యమ్మ వదిన, మరదలు చెరో అరెకరం భూమి పట్టా చేయించుకునేందుకు ధరణిలో స్లాట్ బుక్ చేయించుకున్నారు. అనంతరం సాయంత్రం వెళ్లి సత్యనారాయణ అంత్యక్రియలు నిర్వహించారు. రిజిస్ట్రేషన్ కోసం సత్యనారాయణ మృతదేహాన్ని ఇంటి ముందే వదిలి వెళ్లడంతో అతడి తల్లి కాపలా కాయడం చూసి పలువురు కంటతడి పెట్టారు.

బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి

భువనగిరి: తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించేందుకు బీజేపీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. భువనగిరి మండలం బస్వాపురంలో నిర్వహిస్తున్న పార్టీ రాజకీయ శిక్షణ తరగతులకు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందువులు, ముస్లిం రాజుకు మధ్య జరిగిన యద్ధంగా బీజేపీ చిత్రీకరించడం సరికాదన్నారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా 17న భూదాన్‌పోచంపల్లి మండలం పిల్లాయిపల్లి గ్రామం నుంచి జిల్లా జాత ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాటూరి బాలరాజు, మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి వర్గ సభ్యులు పల్లెర్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మంత్రి పూజలు



మంత్రి రవీంద్ర జైశ్వాల్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న నర్సింహమూర్తి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామిని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర స్టాంప్స్ అండ్ కోర్టు ఫీ, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి రవీంద్ర జైశ్వాల్ గురువారం రాత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. మంత్రి గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో మంత్రికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి లడ్డూ ప్రసాదం అందజేశారు.

వీర్లపాలెం లైన్‌మెన్‌పై సస్పెన్షన్ వేటు



లైన్‌మెన్ శ్రీనివాస్ ఇంటికి సస్పెన్షన్ ఉత్తర్వులు అంటిస్తున్న అధికారి

మిర్యాలగూడ అర్బన్: దామరచర్ల మండలం వీర్లపాలెంలో విధులు నిర్వహిస్తున్న ట్రాన్స్‌కో లైన్‌మెన్ గుంటూరు శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ డీఈ వెంకటేశ్వర్లు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రమోషన్ విషయంలో తన నుంచి లంచం డిమాండ్ చేసిన మిర్యాలగూడ డీఈతో పాటు మరో ఇద్దరు ఉద్యోగులను లైన్‌మెన్ శ్రీనివాస్ గత సంవత్సరం ఏసీబీకి పట్టించాడు. ఆ కేసు ప్రస్తుతం కోర్టు విచారణలో ఉంది. ఇటీవల మరోసారి తన ప్రమోషన్ గురించి ఉన్నతాధికారులను అడగగా.. ఏసీబీ కేసుతో లింక్ పెట్టి దానిని విత్‌డ్రా చేసుకోవాలని ఇబ్బందులు పెడుతున్నారని ఇటీవల శ్రీనివాస్ మిర్యాలగూడ డీఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆరోపించాడు. కాగా ఉన్నతాధికారుల అనుమతి లేకుండా డీఈ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టి అసత్య ఆరోపణలు చేసిన లైన్‌మెన్ శ్రీనివాస్‌ను విధుల నుంచి తప్పిస్తున్నట్లు డీఈ తెలిపారు. లైన్‌మెన్ శ్రీనివాస్ గతంలో తన విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సర్వీస్ రికార్డులో ప్రమోషన్ పనిష్మెంట్ విధించినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా డిపార్ట్‌మెంట్ ప్రమోషన్లకు సంబధించిన కేసు హైకోర్టులో నడుస్తుండగా పదోన్నతి ప్రక్రియలో పురోగతి లేదన్నారు. ఈ విషయంపై లైన్‌మెన్‌కు అవగాహన ఉన్నప్పటికీ ఉద్దేశపూర్వకంగా అధికారులపై నిందలు మోపాడని డీఈ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించి అధికారులపై అసత్య ఆరోపణలు చేస్తున్నందుకుగాను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లైన్‌మెన్ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు డీఈ పేర్కొన్నారు. కాగా సస్పెన్షన్ ఉత్తర్వులను స్వీకరించేందుకు లైన్‌మెన్ శ్రీనివాస్ నిరాకరించడంతో అతడి ఇంటి గోడకు అంటించామని డీఈ తెలిపారు. ఆయన వెంట రూరల్ ఏడీఈ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

ఆ విగ్రహం జాడేదీ..?

- అంతంపేటలో చోరీకి గురైన ముత్యాలమ్మ విగ్రహం
- ఏడాదిన్నరవుతున్నా ఆచూకీ కనిపెట్టని పోలీసులు



చోరీకి గురైన విగ్రహం ఇదే..

చండూరు(గట్టుప్పల్): గట్టుప్పల్ మండల పరిధిలోని అంతంపేట గ్రామంలో రెండు సంవత్సరాల క్రితం లభించిన కోట్ల విలువైన ముత్యాలమ్మ విగ్రహం జాడ కనిపించడం లేదు. దొంగిలించబడిన ఆ విగ్రహం గురించి పోలీసులు నెల రోజులు హడావుడి చేశారే తప్ప జాడ కనుక్కోలేకపోయారు. వివరాలు.. అంతంపేట గ్రామ శివారులోని ముత్యాలమ్మ దేవాలయంలో గల వేప చెట్టు వేర్లలో 2021 జూన్ 24న ముత్యాలమ్మ విగ్రహం(సుమారుగా 2 కిలోల600 గ్రాములు) గ్రామస్తులకు లభ్యమైంది. ముత్యాలమ్మ ఆలయంలో భద్రత సరిగ్గా లేని కారణంగా గ్రామస్తులు ఆ విగ్రహాన్ని అదే గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధి ద్వారా ఆంజనేయస్వామి దేవాలయంలో భద్రపరిచి తాళం వేసి తాళంచెవిని ఆ ప్రజాప్రతినిధి, ఆలయ కమిటీ సభ్యుల దగ్గరే ఉంచారు. కాగా 2022 ఏప్రిల్ 2న ఆంజనేయస్వామి ఆలయంలో ముత్యాలమ్మ విగ్రహం కనిపించలేదు. దేవాలయానికి తాళాలు మాత్రం వేసి ఉన్నాయి. గ్రామస్తులు సమాచారం మేరకు పోలీసులు అనుమానాస్పద వ్యక్తులను విచారించి క్లూస్ టీం ద్వారా వేలిముద్రలు సేకరించారు. అప్పటి నుంచి నేటి వరకు ఆ విగ్రహం జాడ కనిపించకుండా పోయింది.

కఠినంగా శిక్షించాలి

కోట్ల విలువైన విగ్రహాన్ని దొంగిలించిన వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలి. పోలీసులు విచారణ వేగవంతం చేయాలి. గతంలో ఒకసారి ఎస్పీకి ఫిర్యాదు చేశామని, సోమవారం మరోసారి ఎస్పీకి ఫిర్యాదు చేస్తాం.
– నేనావత్ బంతిలాల్, ఎంపీటీసీ, అంతంపేట

బంగారమా.. పంచలోహమా..

లభ్యమైన విగ్రహం ముమ్మాటికి బంగారమేనని గ్రామస్తులు చెబుతున్నారు. కొంతమంది మాత్రం అది పంచలోహ విగ్రహమంటున్నారు. ఆ విగ్రహానికి సుమారు రూ.3కోట్లకు పైచిలుకు వరకు విలువ ఉంటుందని ఆ గ్రామ ఎంపీటీసీ నేనావత్ బంతిలాల్ చెబుతున్నారు. కొంతమంది డబ్బు కోసం ఆ వివిగ్రహాన్ని మాయం చేశారని ఆయన ఆరోపిస్తున్నారు.

క్లుప్తంగా

సర్పంచ్ నగేష్‌కు సన్మానం

ఆత్మకూరు(ఎం): స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ -2023 జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు అందుకున్న సర్పంచ్ జన్నాయికోడె నగేష్‌ను గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొడిత్యాల నరేందర్ గుప్తా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి కందడి అనంతరెడ్డి, డైరెక్టర్ నోముల వెంకట్‌రెడ్డి, తండ శ్రీశైలం, సిద్దులు, మల్లేశం గౌడ్, అంజిరెడ్డి, నర్సయ్య, అయిలయ్య, అనంతరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేయాలి

గుండాల: కాంగ్రెస్ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని పీఏసీఎస్ చైర్మన్ లింగాల భిక్షం అన్నారు. గురువారం మండలంలోని సుద్దాల గ్రామంలో బూత్ స్థాయి వార్డు కమిటీలను ఎన్నుకున్నారు. బీసీ సెల్ నాయకుడిగా కోమట్ల మధు, ఓసీఈ సెల్ నాయిని కృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ బద్దుల ఎల్లయ్యను నియమించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుమ్మ డెన్నిస్‌రెడ్డి, నాయకులు చిందం ప్రకాష్, కె.రవికుమార్, రామచంద్రయ్య, రాజరత్నం, బడక వెంకన్న, ఉప సర్పంచ్ రవి, జంపాల భవ్య, సోమన్న, మల్లయ్య పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా భాస్కర్

ఆత్మకూరు(ఎం): కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఏనుతల భాస్కర్ ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు దుర్గాయి హరి ప్రసాద్ గురువారం నియామక పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఏనుతల భాస్కర్ మాట్లాడుతూ నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీలు ఎన్నిక

రామన్నపేట : మండలంలోని వెల్లంకి, కక్కిరేణి కాంగ్రెస్ గ్రామశాఖల నూతన కమిటీలను గురువారం ఎన్నుకున్నారు. వెల్లంకి గ్రామశాఖ అధ్యక్షుడిగా అయిటిపాముల పెద్దులు, ఉపాధ్యక్షుడిగా మిర్యాల నరేష్, ప్రధానకార్యదర్శిగా నిమ్మల మధు, కోశాధికారిగా రావీటి రమేష్, ప్రచార కార్యదర్శులుగా సాగర్ల సైదులు, కర్రె సతీష్, సహాయ కార్యదర్శిగా గుంటోజు మధు, కమిటీసభ్యులుగా చెరిపెల్లి శేఖర్ ఎన్నికయ్యారు. కక్కిరేణి గ్రామశాఖ అధ్యక్షుడిగా కన్నెబోయిన జగన్, ఉపాధ్యక్షుడిగా చిల్ల శ్రీను ప్రధానకార్యదర్శిగా వేముల దయాకర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పున్న నరసింహ, రాష్ట్ర నాయకుడు పున్న రమేష్, పిట్ట వెంకట్‌రెడ్డి, వనం పురుషోత్తం, నర్సింహ, జానయ్య, లింగారెడ్డి, పరమేష్, పున్న అంజయ్య, చక్రపాణి, వెంకటఅరవింద్ పాల్గొన్నారు.

బీఎస్పీ మహిళా కమిటీ కో కన్వీనర్‌గా సంతోష

రామన్నపేట : మండలంలోని ఎన్నారం గ్రామానికి చెందిన గూడపూరి సంతోషను బీఎస్పీ మండల మహిళా కమిటీ కో కన్వీనర్‌గా, మునిపంపుల గ్రామానికి చెందిన బందెల అనితను మండల మహిళా కార్యదర్శిగా నియమిస్తూ ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మర్రి శోభ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామక ఉత్తర్వులను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడి ప్రియదర్శిని అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు గద్దపాటి రమేష్, మండల అధ్యక్షుడు మేడి సంతోష్, మహిళా కన్వీనర్ కక్కిరేణి శిరీష, నర్సింహ, రాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా మచ్చ నర్సింహ గౌడ్

యాదగిరిగుట్ట: తెలుగుదేశం పార్టీ యాదగిరిగుట్ట మండలం నూతన కమిటీని ఆలేరు నియోజకవర్గ కో కన్వీనర్ రేగు బాల్‌నర్సయ్య ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన మచ్చ నర్సింహగౌడ్, ప్రధాన కార్యదర్శిగా కల్లెం బాబురావుగౌడ్, గుట్ట పట్టణ అధ్యక్షుడిగా చిత్తర్ల శ్రీనివాస్‌గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో మండలాల అధ్యక్షులు అనంతుల నర్సింహరెడ్డి, బొబ్బల పద్మారెడ్డి, గుండా భాస్కర్, శాగంటి బాల్‌నర్సింహ, శీలం శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, సంతోష్, అంజయ్య పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి

చౌటుప్పల్ : పట్టణంలోని వెంకటరమణ కాలనీలోని సర్వే నంబర్ 238లో రోడ్డుకు అడ్డంగా చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని గురువారం ఆ కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సునీత, మౌనిక, రజియా, రాధిక, కృష్ణ, మల్లేశం, వెంకటేశం, యాదగిరి, జ్యోతి, సంధ్య, మహేష్, సతీష్‌రెడ్డి, లింగస్వామి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఇంద్రసేనారెడ్డి

చౌటుప్పల్ : హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఈనెల 17న నిర్వహించే కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని రాజీవ్‌స్మారక భవన్‌లో పట్టణ కమిటీ అధ్యక్షుడు సుర్వి నర్సింహగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల శ్రీహరి, కేతరాజు అచ్చయ్య, పెద్దోని రమేష్, రాచకొండ భార్గవ్, దేశగోని మల్లేశం, ఊదరి సురేష్, యాదయ్య, శ్రీకాంత్, భాస్కర్‌రెడ్డి, గోపాల్, మహేష్, నాగరాజు, మహేందర్ తదితరులు ఉన్నారు.

నిర్మించారు..వదిలేశారు!

- నిరుపయోగంగా మునిపంపుల అంగన్‌వాడీ కేంద్రం, లక్ష్మాపురం ఉన్నత పాఠశాల భవనం
- నిర్మించి ఏళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోని వైనం



మునిపంపులలో ప్రారంభానికి నోచుకోని అంగన్‌వాడీ భవనం



లక్ష్మాపురంలో నిరుపయోగంగా పాఠశాల భవనం

రామన్నపేట : అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని మునిపంపుల, లక్ష్మాపురం గ్రామాల్లో లక్షల రూపాయాలు వెచ్చించి నిర్మించిన భవనాలు ప్రారంభానికి నోచుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. మండలంలోని మునిపంపుల గ్రామంలోని బోటిమీదిగూడెంలో 2016వ సంవత్సరంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. వివిధ కారణాలతో నిర్మాణపనులు ఆలస్యంగా జరిగాయి. ఆరు నెలల క్రితమే భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కాంట్రాక్టర్‌కు పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లింపు జరుగలేదనే కారణంతో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు భవనాన్ని స్త్రీశిశు సంక్షేమశాఖ వారికి అప్పగించకపోవడంతో ఈ భవనం ప్రారంభం కావడం లేదు. దీంతో భవన పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా తయారైంది. ఇదిలా ఉండగా ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రం అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య కొనసాగుతుంది.

లక్ష్మాపురంలో ఉన్నత పాఠశాల భవనం..

మండలంలోని లక్ష్మాపురం ఉన్నతపాఠశాల 2008వ సంవత్సరంలో సక్సెస్ స్కూల్‌గా ఎంపికైంది. సక్సెస్ స్కూళ్లలో అప్పటి ప్రభుత్వం తెలుగుతో పాటు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రారంభించింది. దీంతో అదనపు తరగతిగదులు అవసరయ్యాయి. అదనపు తరగతిగదుల నిర్మాణానికి ఆర్ఎంఎస్ఏ నుంచి రూ.30లక్షలు మంజూరయ్యాయి. దాతల సహకారంతో అదనపుగదుల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పాఠశాల పక్కనే కొనుగోలు చేసి తరగతి గదులను నిర్మించారు. గదుల నిర్మాణం పూర్తయ్యేనాటికి పాఠశాలలో పిల్లలసంఖ్య తగ్గిపోయింది. అప్పటికే ఉన్న తరగతిగదులే సరిపోవడంతో లక్షలు వ్యయం చేసి నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉంటుంది. ఇప్పటికైనా ఈ భవనాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అటు పాలకులు, ఇటు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉపయోగంలోకి తీసుకురావాలి



మునిపంపుల గ్రామం బోటిమీదిగూడెంలో నిర్మించిన అంగన్‌వాడీ భవనం నిరుపయోగంగా ఉంది. భవనం ఉపయోగంలోకి రాకపోవడంతో ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దెభవనంలోనే అరకొర వసతుల మధ్య నిర్వహిస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని నూతన భవనాన్ని ఉపయోగంలోకి తీసుకు రావాలని కోరుతున్నాం.

– బొడ్డుపల్లి వెంకటేశం, సీపీఎం మండల కార్యదర్శి

సమస్యలు పరిష్కరించాలని సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

భువనగిరిటౌన్ : మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుంచి పట్టణాలను శుభ్రం చేసి ప్రజల ఆరోగ్యం కాపాడుతున్న మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వాలు వెట్టిచాకిరి చేయించుకుంటున్నాయని ఆరోపించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 60జీఓ ప్రకారంగా మూడు కేటగిరి వేతనాలు చెల్లించాలని వారాంతపు సెలవులు, పండుగ సెలవులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కొండయ్య శ్యామల, యాదమ్మ, నిర్మల, నర్సమ్మ, సుశీల, శంకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

యాదగిరిగుట్ట: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం రాజాపేట మండలం చల్లూరు, పాముకుంట, యాదగిరిగుట్ట మండలం చిన్నకందుకూర్, ఆత్మకూరు(ఎం) మండలం సింగారం, రహీంఖాన్‌పేట గ్రామాలకు చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు యాదగిరిగుట్టలో ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయా కార్యక్రమాల్లో రాజాపేట ఎంపీపీ గోపగాని బాలమణి యాదగిరిగౌడ్, జెడ్పీటీసీ చామకూర గోపాల్‌గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, ఆయా మండలాల అధ్యక్షులు కర్రె వెంకటయ్య, బీసు చందర్‌గౌడ్, ఎంపీటీసీ ఎర్ర పోశయ్య, కట్ట మల్లేశం, భీమగాని నర్సింహగౌడ్, గాల్‌రెడ్డి, సందిల భాస్కర్‌గౌడ్, ప్రవీణ్, లింగయ్య, పన్నాల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్ : లక్ష రూపాయల లోపు ఉన్న రుణాలను కేసీఆర్ మాఫీ చేయడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ వైఎస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని వంగపల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో రుణమాఫీ పొందిన రైతులకు మళ్లీ ఇచ్చిన పంట రుణాల చెక్కులను గురువారం అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ సత్యవతి, పీఏసీఎస్ వైఎస్ చైర్మన్ ఎగ్గిడి బాలయ్య, జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రేపాక స్వామి, పీఏసీఎస్ డైరెక్టర్‌లు కానుగు భిక్షం గౌడ్, గౌరమ్మ, మొగిలిపాక రాంచందర్, వీరస్వామి, కిష్టయ్య, శ్రీనివాస్, ఎంపీటీసీ రేపాక మౌనిక, పోచయ్య, గ్రామశాఖ అధ్యక్షులు క్రిష్ణస్వామి, సూపర్‌వైజర్ ప్రదీప్, భద్రారెడ్డి, బాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు రూ. 26వేల వేతనం ఇవ్వాలి



ఆలేరురూరల్ : నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు

ఆలేరురూరల్ : అంగన్‌వాడీలకు రూ.26వేలు చెల్లించాలని అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు బూరుగు స్వప్న, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు. గురువారం ఆలేరు పట్టణ కేంద్రంలోని స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. సమ్మెకు ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎ.ఎక్బాల్, రమేష్, పాల్, నాగరాజు, చెక్క వెంకటేష్, మద్దతు తెలపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, పద్మ, రమ, కొరుటూరి భాలమణి, విజయ, లక్ష్మి, మంజూల, ఉమ, సునీత, శ్యామల, జ్యోతి, రజిని భూలక్ష్మి, శోభ పాల్గొన్నారు.

రామన్నపేట : సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీ టీచర్లకు రూ. 26వేల వేతనం చెల్లించాలని అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వప్న డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ టీచర్లు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లాకార్యదర్శి కల్లూరి మల్లేశం, గొరిగె సోములు, బొడ్డుపల్లి వెంకటేశం, గురుకు లలిత, బాదె మంజుల, సమత, వసంత, బద్రున్నిసా, కౌశల్య, జ్యోతి, పుష్ప, నాగమణి, సంధ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడి కార్యకర్తలు, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి దోనూరి నర్సిరెడ్డి, శిరీష, వనజ, సావిత్రి, సరోజ, విజయలక్ష్మి, వసంత, సత్తమ్మ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి : ఎంపీ



కుట్టు మిషన్లు అందజేస్తున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

భువనగిరి : మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వీరవెల్లి గ్రామంలో తన సొంత నిధులతో 50 మంది మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామంలో ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం రూ. 5 లక్షలు, సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్, రామాంజనేయలు గౌడ్, సంజీవరెడ్డి, ప్రమోద్‌కుమార్, ఎలిమినేటి కృష్ణారెడ్డి, చిక్కుల వెంకటేష్,పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వనం కృష్ణ, బర్రె జహంగీర్,ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు



సింగిల్‌విండో కార్యాలయం ఎదుట బారులుదీరిన రైతులు

చౌటుప్పల్ : యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చౌటుప్పల్‌లోని సింగిల్‌విండో కార్యాలయం ఎదుట గురువారం ఉదయం నుంచే రైతులు బారులుదీరారు. 140మందికి మూడు బస్తాలు చొప్పున అందజేశారు. మండలంలోని పలువురు డీలర్లకు వంద టన్నుల యూరియా దిగుమతి అయ్యిందని సింగిల్‌విండో సీఈఓ వై.రమేష్ తెలిపారు.

రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోత్కూరు/అడ్డగూడూరు : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ ఆధ్వర్యంలో మోత్కూరు, అడ్డగూడూరు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆలయాల్లో పూజలు నిర్వహించారు. పలువురు నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

యాదగిరిగుట్ట రూరల్ : విద్యుదాఘాతంతో ఓ పాడి గేదె మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని దాతర్‌పల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు చుక్కల పోచయ్య రోజు వారిగానే గేదెలను మేతకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో గేదె మేత మేసుకుంటూ పొలంలో ఉన్న విద్యుత్ స్తంభంపై నుంచి అప్పటికే తెగి పడి ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

గొర్రెల పంపిణీలో అక్రమాలను అరికట్టాలి

వలిగొండ : రెండో విడత గొర్రెల పంపిణీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బుగ్గ చంద్రమౌళి అన్నారు. గురువారం మండలంలోని పులిగిల్లలో పెంపకందారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గొర్రెల పంపిణీలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీరప్ప, బుగ్గ మనోజ్, నరసింహ, బుగ్గ పాండు, బాల నరసింహ పాల్గొన్నారు.

గణపతి విగ్రహాల ధరలను తగ్గించాలని వినతి

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలో గణపతి విగ్రహాల ధరలను తగ్గించాలని కోరుతూ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కారుపోతుల వెంకన్న, నాయకులు నిమ్మల శ్రీనివాస్‌లు గురువారం ఎస్ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్, చైర్పన్ టి.సావిత్రిలకు వినతిపత్రం అందజేశారు. విచ్చలవిడిగా ధరలు పెంచి దోచుకుంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

బీజేపీలో చేరికలు

గుండాల : మండలంలోని మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు గురువారం ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు పడాల శ్రీనివాస్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గంగాపురం రమేష్, నాయకులు ప్రభాస్‌రాజ్, శ్రీకాంత్, కిష్టయ్య, హరీష్, శ్రీను, పోశయ్య, యాకన్న, భోజయ్య, సోమయ్య, రామాచారి, బాలమల్లయ్య, యాదగిరి, మల్లయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ

రాజాపేట : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఆర్యవైశ్య కులస్తులు భక్తిశ్రద్ధలతో బోనాల మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలతో మహిళలు సామూహికంగా బోనాలను తీసుకెళ్లి పోచమ్మకు సమర్పించారు.



బోనాలు ఎత్తుకుని వస్తున్న మహిళలు

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



భువనగిరి : కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



భూదాన్‌పోచంపల్లి : కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

భువనగిరి : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేపట్టిన నిరాహార దీక్షను భగ్నం చేసి పార్టీ కార్యాలయానికి తరలించడాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం వినాయక చౌరస్తా వద్ద కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షుడు చందా మహేందర్ గుప్తా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాయ దశరథ, కౌన్సిలర్లు రత్నపురం బలరాం, మహమూద్, జనగాం నర్సింహా చారి, శ్రీధర్, లక్ష్మణ్, భాస్కర్, కపిల్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దీక్షను భగ్నం చేసినందుకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో గురువారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాశం భాస్కర్, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, జిల్లా కార్యదర్శి చింతల రామకృష్ణ, ఓబీసీ జిల్లా అధికార ప్రతినిధి గోదాసు లింగస్వామి, మండల అధ్యక్షుడు మేకల చొక్కారెడ్డి, బస్వయ్య, రచ్చ శేఖర్, గంజి బస్వలింగం, రమేశ్, డబ్బీకార్ సాహేశ్, తుమ్మ లక్ష్మీనారాయణ, కర్నాటి నర్సింహ, ఎర్ర లక్ష్మణ్, అంజయ్య పాల్గొన్నారు.

ఆలేరురూరల్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నిరుద్యోగుల సమస్యలపై చేపట్టిన దీక్షను భగ్నం చేసినందుకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో గురువారం పట్టణ కేంద్రంలోని రైల్వేగేటు వద్ద సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు బడుగు జహంగీర్, రాఘవేంద్ర, మహేష్, రమేష్, శ్రీనివాస్, తోటమల్లయ్య, భాస్కర్, వెంకటేష్, ఆంజనేయులు, ఆనంద్, సతీష్, సుభాష్, పత్తి రాములు, కొమరయ్య, హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేపట్టిన నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేసినందుకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిల్లా నాయకులు బొబ్బల ఇంద్రారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు బందారు సత్యనారాయణ, బండి ఉప్పలయ్య, పిక్క పరుశరాములు, కందుల సంతోష్, బండారి సాయికుమార్, విజయ్‌కుమార్, బాలనర్సయ్య పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేస్తున్న దీక్షను భగ్నం చేసినందుకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరపల్లి శివాజీ, ఆత్కురి గిరి, వంగరి రఘు, దాసోజు వెంకటాచారి, వెంకటేశం, బూస శ్రీనివాస్, బండమీది కిరణ్‌కుమార్, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు

చౌటుప్పల్ : రాష్ట్రంలో నియంత పాలన సాగిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి రాబోయే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ గురువారం పట్టణంలోని జాతీయ రహదారిపై ఆ పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు రిక్కల సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, భిక్షమాచారి, సురేందర్‌రెడ్డి, బత్తుల జంగయ్య, ఊడుగు యాదయ్య, దిండు భాస్కర్, ఉబ్బు భిక్షపతి, పబ్బు వంశీ, ఎర్ర గణేష్, బండారు మహేందర్‌రెడ్డి, సురేష్, సత్తయ్య, పాండు, లింగస్వామి, గణేష్ తదితరులు ఉన్నారు.

మోటకొండూర్: నిరుద్యోగుల సమస్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేపట్టిన 24గంటల నిరహార దీక్షను భగ్నం చేసి నిర్బంధించడాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పీసరి తిరుమలరెడ్డి, పన్నాల చంద్రశేఖర్‌రెడ్డి, జోరుక ఎల్లేష్, గాజుల బాలరాజుగౌడ్, స్వామి, ప్రవీణ్‌గౌడ్, గడ్డం రమేష్‌గౌడ్, సీస మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

రాజాపేట : కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి దీక్షను భగ్నం చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్, మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ బూర్గు శేఖర్‌రెడ్డి, నాయకులు గాండ్ల నర్సింగరావు, కుమ్మరి లక్ష్మణ్, గవ్వల సిద్దేశ్వర్, మార్క శివ తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేపట్టిన దీక్షను భగ్నం చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాగెల్లి సుధాకర్,దంతూరి సత్తయ్య,కృష్ణ,రాములు,బచ్చు శ్రీనివాస్, సంతోష్,అనిల్ కుమార్, వెంకటేష్,హరి కృష్ణ పాల్గొన్నారు.

బీబీనగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేపట్టిన దీక్షను భగ్నం చేసినందుకు నిరసనగా గురువారం బీబీనగర్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జంగారెడ్డి, సుదర్శన్, పరంకుశం, ప్రభాకర్, ఉప్పలాచారి, వెంకటేశం పాల్గొన్నారు.

తుర్కపల్లి: కేంద్ర మంతి కిషన్‌రెడ్డి అరెస్ట్‌కు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో రాస్తారోకో చేసి సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రాజుగౌడ్, శ్రీనివా స్, ఆంజనేయులు, పాండు శేఖర్, క్రిష్ణ, లచ్చ య్య, వేణు, వంశీ, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

బొమ్మలరామారం : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేపట్టిన 24 గంటల దీక్షను భగ్నం చేయడం బీఆర్ఎస్ ప్రభుత్వ నియంతపాలనకు నిదర్శనమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మాదిరెడ్డి సుభాష్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రంగా రామగౌడ్, గోపాల్ గౌడ్, గణేష్, భూపాల్, కుమార్, కృష్ణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ మున్సిపల్ కేంద్రంలోని రోడ్డుపై ఆ పార్టీ నాయకులు గురువారం ఆందోళన చేశారు. శాంతియుతంగా దీక్ష చేస్తున్న కిషన్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో రైల్వే బోర్డు మెంబర్ కొంతం నాగార్జునరెడ్డి, జిల్లా నాయకులు గౌరు శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు బయ్యని రాజు, ముత్తినేని తిరుమలేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు మరాటి విజయలక్ష్మి, నల్ల మాసిరెడ్డి, ఉప్పలయ్య, శ్రీను, రాములు, సంతోష్, వెంకటేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న చేనేత నాయకులు

ఆలేరురూరల్ : చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆలేరు మండల చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా జౌళిశాఖ అధికారి విద్యాసాగర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా త్రిఫ్ట్ చేనేత బీమా, చేనేత మిత్ర పథకాన్ని అర్హులైన చేనేత కార్మికులకు, కళాకారులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు గట్టు రాజు, ప్రధాన కార్యదర్శి మెరుగు శ్రీదర్, చెన్న రాజేష్, చింతకింది గిరిప్రసాద్, సిద్దులు, కటకం లక్ష్మణ్, సతీష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలి

రామన్నపేట : తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలని పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సూరారం, తుర్కపల్లి గ్రామాల్లో నిర్వహించిన బూత్ కమిటీల సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు.కార్యక్రమంలో సర్పంచ్‌లు పోలబోయిన అండాలు నర్సింహ, చెరుకు సోమయ్య, ఎంపీటీసీ దోమల సతీష్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మల్లేశం, జింకల మల్లేష్, బాసాని శ్రీను, ఉపసర్పంచ్ సుధాకర్‌రెడ్డి, బలరాం, రాములు, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

రాజాపేట : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడోత్సవాలు గురువారం ముగిశాయి. క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు రైతు సమన్వయ సమితి కన్వీనర్ గౌటే లక్ష్మణ్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆడెపు ఈశ్వరమ్మ శ్రీశైలం, ఎస్ఎంసీ చైర్మెన్ గుర్రం పాండు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్లెట్లపల్లి రాములుకు నివాళి

మోత్కూరు : ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ వ్యక్తిగత సహాయకుడు, బీఆర్ఎస్‌వీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కల్లెట్లపల్లి శోభన్‌బాబు తండ్రి కల్లెట్లపల్లి రాములు (68) అనారోగ్యంతో మృతి చెందారు. స్వగ్రామమైన సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరి గ్రామంలో రాములు మృత దేహాన్ని మండలానికి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, జర్నలిస్టులు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు కొణతం యాకూబ్ రెడ్డి, చిప్పలపల్లి మహేంద్రనాథ్, మేఘారెడ్డి, మండల అధ్యక్షుడు పొన్నబోయిన రమేష్, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు గుర్రం లక్ష్మీనర్సింహ రెడ్డి, రాంపాక నాగయ్య, మధు, జర్నలిస్టులు ఎస్.ఎన్.చారి, జహంగీర్, సోంబాబు, ఎండీ.షాకీర్ పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

మోటకొండూర్: మండల కేంద్రంలోని పలువురి రైతుల పంట పొలాలను గురువారం వ్యవసాయ మండల వ్యవసాయ అధికారి సుబ్బూరి సుజాత పరిశీలించారు. సాగులో వివిధ దశల్లో ఆశించే పురుగులు అందించాల్సిన పోషకాలు, తీసుకోవాలిన్సన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు రేగు యాదయ్య, కొల్లూరి సిద్దయ్య, భూమండ్ల మల్లేష్ తదితరులు ఉన్నారు.

108 వాహనంలో ప్రసవం

మోత్కూరు : నెలలు నిండిన గర్భిణికి పురుటి నొప్పులు రావడంతో ఆమెను కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా 108 వాహనంలోనే ప్రసవించింది. వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండలంలోని గోవిందాపురం గ్రామానికి చెందిన బుర్రు అమృత ప్రసవ వేదనంతో మోత్కూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. ఉమ్మ నీరు సమస్యతో స్థానిక వైద్యులు భువనగిరి ఏరియా ఆస్పత్రికి 108లో తరలిస్తుండగా మార్గమధ్యలో రాయగిరి వద్ద అంబులెన్సులోనే పాపకు జన్మనించింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు మెరుగైన చికిత్సకు ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు 108 ఈఎంటీ ఎస్.భాస్కర్, పైలెట్ సోమేశ్వర్ తెలిపారు.

27న వినాయక నిమజ్జనం నిర్వహించాలి

చౌటుప్పల్ : మున్సిపల్ పరిధిలో ఈ నెల 27న వినాయక నిమజ్జనం నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే గణపతి నవరాత్రోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. 27నని ఐచ్చిక సెలవుగా ప్రకటించుకుని గణపతి నిమజ్జన ఉత్సవాన్ని నిర్వహించుకోవాలన్నారు. ఇందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

భువనగిరి : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం.. మండలంలోని హన్మాపురం గ్రామ శివారులో గురువారం సాయంత్రం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బస్వాపురం ప్రాజెక్టు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.